

# అదృష్టవంతుడు

ఇలపావులూరి మురళీమోహనరావు

రామారావు వర్ధమాన రచయిత. గత రెండు సంవత్సరాలలో పది కథలు రాశాడు. వివిధ దిన, వార, మాస పత్రికలకు పంపించాడు. వాటిలో తొమ్మిది కథలు తిరుగు టపాలో రాగా ఒక్క మినీ కథ మాత్రం ఒక అనామక పత్రికలో ప్రచురితమైంది. అర పేజీలో అచ్చైన తన కథను చూసి తెగ సంబరపడిపోయాడు. ఏభై కాపీలను కొనేసి బంధువులకు, ఆఫీసులోని సహచరులకు శుభలేఖలు పంచినట్లు పంచాడు. అయితే కథ అందుకున్న ప్రతి వాడూ 'ఎంత పంపించారు!' అని అడిగారే తప్ప 'ఆహా.. నువ్వు రచయితవా?' అని ఒక్కడూ అనలేదు.



ఆ తరువాత మరో పది కథలు రాసి పంపించగా అన్నీ క్షేమంగా- సాయంకాలానికి గూటికి చేరే పక్షుల్లా- భద్రంగా తిరిగొచ్చాయి. దాంతో నిరాశ ఆవహించింది. భార్య వసుంధర మాత్రం తిట్టిపోసింది. 'ఒక కన్ను కన్ను కాదు. ఒక కథ అచ్చైనంత మాత్రాన రచయితా కాడు. నిన్ను రచయితగా గుర్తించుట కుదరదు.' అని కుండ బద్దలు కొట్టింది. దాంతో రామారావులో పంతం పెరిగింది. సాయంత్రం ఆఫీసునుంచి రాగానే రెండు పెట్టెల సిగరెట్లు, ఫ్లాస్కు నిండా టీ నింపుకుని గదిలో ఒంటరిగా కూర్చుని టీ వెంబడి సిగరెట్, సిగరెట్ వెంట టీ తాగుతూ ఐడియాలకోసం బుర్ర బద్దలు కొట్టుకోసాగాడు. అయినా ప్రయోజనం లేకపోయింది.



''ఈవిధంగా టీలు, సిగరెట్లు తాగుతుంటే నోట్లోంచి కంపు, ఊపిరితిత్తుల్లోకి కేన్సర్ వస్తాయి కానీ బుర్రలోకి అయిడియాలు ఎలా వస్తాయి? వ్యాసుడు, వాల్మీకి, కాళిదాసు, నన్నయ, తిక్కన, పోతన, శ్రీనాథుడు వంటి వారంతా సిగరెట్లు, చుట్టలు తాగే మహాకావ్యాలు రాశారా? మనసుతో ఆలోచిస్తే మంచి కథ పుడుతుంది. సమాజంలో జరిగే సంఘటనలను మెదడులో దృశ్యరూపం చేసుకుంటే వాస్తవగాథలు తన్నుకొస్తాయి. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలకు పరిష్కారం ఆలోచిస్తే కథలు పుట్టల్లాగా పుట్టుకొస్తాయి. సిగరెట్లు, కాఫీలు టీలవల్ల కథలు పుట్టేట్లయితే నూటికి తొంభై మంది రచయితలౌతారు.'' అన్నది వసుంధర.

''అబ్బా...నీకు చాలా తెలుసే. చెప్పడం తేలికే. పోనీ ఆ పనులేవో నువ్వే చేసి కథలు రాయరాదూ?'' కోపంగా అన్నాడు రామారావు.

''రోడ్డుమీద ఒక మురికి గుంట ఉంది. ఓ పిల్లాడు అటు వెళ్తు

న్నాడు. ఆ గుంటలో కాలు పెట్టొద్దు. బట్టలకు మురికి అవుతుంది అని చెప్పడానికి మనమూ మురికి గుంటలో పడుండాలా? ఫలానా పాట బాగుంది అని చెప్పడానికి మనకు సంగీతం తెలిసే ఉండాలా?'' అన్నది వసుంధర.

ఆ తరువాత కొంతకాలానికి 'ఇలాంటి పత్రిక ఒకటి మన వీధిలోనే ఉందా' అని అందరూ ఆశ్చర్యపోయే ఒక పత్రికలో సింగిల్ పేజీ కథొకటి అచ్చైంది రామారావుది. దాదాపు సంవత్సరకాలం తరువాత తన కథ అచ్చు కావడంతో ఎవరెస్టు శిఖరం ఎక్కినంత ఆనందం కలిగింది. వెంటనే వంద కాపీలు కొని తెలిసిన వారందరికీ ఇచ్చాడు. దాన్ని చూసిన ప్రతివాడూ 'ఈ పత్రిక పేరెన్నడూ వినలేదే' అని ముందుగా కామెంట్ చేసి, చిన్నబోయిన రామారావు వదనం చూసి 'కంగ్రాట్స్' అన్నవాడే. మరికొంతమంది 'ఆహా.. కథల ద్వారా కూడా బాగానే సంపాదిస్తున్నావ్!' అన్నారు. ఏడవలేక నవ్వాడు రామారావు. ఎందుకైనా మంచిదని ఏదైనా మనియార్డర్ వస్తే జాగ్రత్తగా ఇవ్వవలసిందిగా హెచ్చరించాడు. ఆర్నెల్లు గడిచినా ఏం రాలేదు.

విసుగెత్తి ఐదారునెలలు కలం పట్టటం మానేశాడు. అయినా, ఆంధ్రదేశానికేమీ నష్టం రాలేదు. కానీ తెలిసిన వారంతా 'మళ్ళీ ఏం రాశావు? సినిమాలకు రాయరాదా' అని వేధించసాగారు.

ఇదిలా ఉండగా ఆంజనేయులు అనే ఒక ప్రముఖ రచయిత భోపాల్ నుంచి ట్రాన్స్‌ఫరై హైదరాబాదొచ్చి రామారావు నివసించే కాలనీలోనే రామారావింటికి రెండు బజార్ల వెనుక అద్దె ఇంట్లో దిగాడు. ఆ విషయం రామారావుకు తెలిసింది. రామారావు చిన్నప్పట్నుంచి అనేక పత్రికలలో ఆయన కథలు చదువుతుండేవాడు. స్త్రీ బాలవృద్ధులనే భేదం లేకుండా అన్ని వర్గాలవారినీ అలరించే వందలాది కథలను రాశాడు ఆంజనేయులు. అనేక మార్లు కథలు, నవలల పోటీలలో ఆయన కథలు బహుమతులు పొందాయి. ఫోటో, పరిచయం కూడా చాలాసార్లు చూశాడు.

''ఇంకేం. ఆయనతో పరిచయం చేసుకోండి. కథలు రాయడంలోని మెళకువలు, సలహాలు చెబుతాడు.'' అన్నది వసుంధర.

''వెధవ సలహాలివ్వకు. నాకు ఒకరు చెప్పఖ్ఖర్లేదు. నాకన్నీ తెలుసు. కాకపోతే మన అభిరుచి సంపాదకులకు తెలిసుండాలి.'' కోపంగా అన్నాడు రామారావు.

''ఏ కళైనా సృజనాత్మకం. ఒక రంగంలో రాణించాలనుకున్నవారు ఆ రంగంలో ఉన్నత స్థానంలో ఉన్నవారిని కలిసి మార్గదర్శకత్వం కోరడంలో తప్పులేదు. ఇతరుల మీద అసూయ పనికిరాదు. మరొకరి సలహా స్వీకరించడం నామోషీ అనుకునేవాడు పైకి రాలేడు. ఎంత సువాసనలు వెదజల్లే మల్లె చెట్టుకైనా పందిరి అవసరం.'' అన్నది వసుంధర.

దాంతో కొంచెం తగ్గాడు రామారావు. వయసులోను, అనుభవంలోనూ ఆంజనేయులు తనకంటే చాలా సీనియర్. ఇస్తే ఏదైనా సలహా ఇస్తాడు. వినడం, వినకపోవడం తన చేతిలో పనే కదా! దాంతో ఆంజనేయులును కలుసుకోవాలనే నిర్ణయించుకున్నాడు.

ఓ శుభ ఆదివారం ఉదయం పూలు, పండ్లు తీసుకుని భార్యను కూడా వెంటబెట్టుకుని ఆంజనేయులింటికి వెళ్ళాడు రామారావు. రామారావు కూడా రచయిత అని తెలుసుకుని చాలా సంతోషించి సాదరంగా ఆహ్వానించాడు ఆంజనేయులు. భార్యా

పిల్లలకు పరిచయం చేస్తూ...''వీరు రామారావు గారని మంచి రచయిత. చక్కని కథలు రాస్తుంటారు. మా ఇద్దరిదీ ఒకే జాతి కాబట్టి ఇక తరచుగా మనం కలుసుకుంటుంటాం. వసుంధరగారితో నీకు మంచి కాలక్షేపం. కొత్త ప్రదేశంలో మనకు పరిచయస్తులు లేరనే చింత తీరింది'' అన్నాడు.

ఆంజనేయులు వంటి సీనియర్ రచయిత తనను రచయితగా చెప్పడం చెప్పలేనంత సంతోషాన్ని కలిగించింది రామారావుకు. తన రెండు ప్రచురిత కథలను ఆయన చదివి ఉంటాడని భావించాడు. ఆయన మీద ఒక్కసారిగా గౌరవం పెరిగిపోయింది.

ఆంజనేయులి భార్య వసుంధరను లోపలకు తీసుకెళ్ళింది. డ్రాయింగ్‌రూంలో ఆంజనేయులు, రామారావు ఇద్దరే మిగిలారు. తమ తమ ఉద్యోగాల గురించి, బదిలీల గురించి మాట్లాడుకున్నారు, తదుపరి సంభాషణ సాహిత్యం వైపు మళ్ళింది.

''ఎన్ని నవలలు రాశారు?'' అడిగాడు ఆంజనేయులు.

''నవలలేం రాయలేదు.'' చెప్పాడు రామారావు.

''ఎన్ని కథలు రాశారు?'' ప్రశ్నించాడు ఆంజనేయులు.

''రెండు'' బదులిచ్చాడు రామారావు రెండునిముషాలు నీళ్ళు నమిలి.

ఊపిరిపీల్చుకున్నాడు ఆంజనేయులు. ''సాధారణంగా ఒకటి, రెండు కథలు రాసిన రచయితల పేర్లు కూడా నా దృష్టికి వస్తాయి. కానీ మీ పేరెన్నడూ వినలేదు. ఏ పత్రికల్లో వచ్చాయి?'' అడిగాడు.

ఇబ్బందిగా ఫీలయ్యాడు రామారావు. తన కథలు ప్రచురించిన పత్రికల పేర్లు చెప్పాడు సిగ్గుపడుతూ.

''ఆ పత్రికల పేర్లు నేనెన్నడూ వినలేదు. ప్రసిద్ధ పత్రికలలో ఏవైనా వచ్చాయా?''

''వాటికీ పంపానండీ. కానీ తిరిగొస్తున్నాయి. వాటిలో అచ్చుకావాలంటే ఏవైనా టెక్నిక్స్ చెబుతారేమోనని...''

''టెక్నిక్స్ అంటూ ప్రత్యేకంగా ఏమీ ఉండవు. ఇతివృత్తంలో మంచి బలం, కొత్తదనం, శిల్పం, వైవిధ్యం ఉండాలి. అంతే.''

నిజానికి శిల్పం అంటే రామారావుకు ఏమాత్రం అవగాహన లేదు. కానీ ఆడగడానికి అహం అడ్డువచ్చింది.

మళ్ళీ ఆంజనేయులే అన్నాడు. ''మీ వంటి యువరచయితలు ముందు సమాజాన్ని బాగా అధ్యయనం చెయ్యాలి. ఒక కథ రాయడానికి ముందు వెయ్యి కథలు చదవాలి.''

''ఓహో.. అదా సంగతి! అంటే వెయ్యి కథలు చదివి ఒక్కో దాంట్లోంచి ఒక్కో వాక్యం కొట్టేసి కొత్త కథ తయారు చెయ్యాలా? కానీ మాటిమాటికీ వెయ్యి కథలు చదవాలంటే కష్టం కదా!''

ఉలిక్కిపడ్డాడు ఆంజనేయులు. ''నో..నో.. నా ఉద్దేశ్యం అది కాదు. ఆయా రచయితలు-కథను ఎలా చెబుతున్నారనేదాన్ని అవగాహన చేసుకోవాలి. అంతే. అంతేకాదు. తమ కథలు తిరిగొస్తున్నాయని కొత్త రచయితలు నిరాశ పడకూడదు. మొదటి వంద పేజీలు మనవి కాదు అనుకోవాలి'' అన్నాడు.

''మన కథలు మనవి కాకపోతే మరెవరివనుకోవాలి? ఎవరైనా ప్రసిద్ధ రచయితల పేర్లతో పంపాలా?''

చెమటలు పట్టాయి ఆంజనేయులుకు. ''మీరు అపార్థం చేసుకున్నారు. మొదట్లో మనం రాసిన పది పదిహేను కథలు తిరిగిరావడం సహజం అని నా ఉద్దేశ్యం.'' అన్నాడు.

''ఓ అలాగా.. ఆ దృష్టితో చూస్తే మొదటి వంద పేజీలేం ఖర్మ? మొదటి వెయ్యిపేజీలు నావికావు.''

ఆ సమాధానంతో ఆంజనేయులు ముఖంలో పూర్తి సంతృప్తి కనిపించింది.

''సార్... మీరు దాదాపు పాతిక సంవత్సరాల నుంచీ కథలు, నవలలు రాస్తున్నారు కదా! మీ రచనలు కూడా తిరిగొస్తుంటాయా?'' ఆసక్తిగా అడిగాడు రామారావు.

''నో...నెవర్.. ఏ పత్రిక ఎలాంటి కథలు స్వీకరిస్తుందో నాకు కొట్టినపిండి. గత ఇరవై సంవత్సరాలలో ఏనాడూ నా కథ తిరిగిరాలేదు.'' గర్వంగా చెప్పాడు ఆంజనేయులు.

ఆ తరువాత వారు మరో అరగంట మాట్లాడుకున్నారు. రామారావు దంపతులు సెలవు తీసుకుంటుండగా.. ''తిరిగొస్తున్నాయని కథలు రాయడం మానకండి. అభ్యాసము కూసు విద్య అన్నారు ఆర్యులు. మీవంటి యువ రచయితలకు

> ''మీ వంటి యువ రచయితలు ముందు సమాజాన్ని బాగా అధ్యయనం చెయ్యాలి. ఒక కథ రాయడానికి ముందు వెయ్యి కథలు చదవాలి.''
>
> ''ఓహో.. అదా సంగతి! అంటే వెయ్యి కథలు చదివి ఒక్కో దాంట్లోంచి ఒక్కో వాక్యం కొట్టేసి కొత్త కథ తయారు చెయ్యాలా? కానీ మాటిమాటికీ వెయ్యి కథలు చదవాలంటే కష్టం కదా!''



## మీరజాలగలడా!

బాలీవుడ్‌లో అజయ్‌దేవ్‌గన్ ఒక విలక్షణ నటుడే కాదు, ఎలాంటి వివాదం లేని వ్యక్తి కూడా. ప్రస్తుతం విశాల్ భరద్వాజ్ నిర్మిస్తున్న 'ఓథెల్లో' కథానాయకుడి పాత్రలో నటిస్తున్నాడు. హీరోయిన్ డెస్టిమోనాగా కరీనా కపూర్ నటిస్తూ వుంది. ఇంతకు ముందు అజయ్ నటించిన రెండు సినిమాల్లో నటించడానికి కరీనా తిరస్కరించింది. 'చోరీచోరీ'లో స్క్రిప్ట్ నచ్చక, 'రెయిన్‌కోట్'లో రీతూపర్ణఘోష్‌తో సరిపడక. అప్పట్లో అజయ్‌దేవ్‌గన్‌కి కరీనాకి మధ్య స్పర్ధలున్నాయని పుకార్లొచ్చాయి. అయితే అవి నిజంకాదని అజయ్ కొట్టిపడేశాడు. ఈమధ్య విర్ల్‌పూల్, టాటా ఫోన్స్ యాడ్స్‌లో కాజోల్‌తో కలిసి అజయ్ నటించాడు. నిజానికి యాడ్స్‌లో నటించడం అజయ్‌కి ఇష్టంలేదు. కానీ కాజోల్‌కి కమర్షియల్స్ అంటే చాలా ఇష్టం. మరి భార్య మాట మీరగలడా అజయ్!

సలహాలివ్వడానికి నేనెపుడూ సిద్ధమే..'' అన్నాడు ఆంజనేయులు.

అదే సమయంలో పక్కింటివాళ్ళ పాప చేతిలో నాలుగు కవర్లు పట్టుకొచ్చి ఆంజనేయులికందిస్తూ..''అంకుల్...నిన్న పోస్టులో వచ్చాయి. ఏవో కథలు తిరిగొచ్చినట్లున్నాయి. నిన్న సాయంత్రం ఇద్దామంటే మీరు బయటకెళ్ళారు.'' అని తుర్రున వెళ్ళిపోయింది.

ఆంజనేయులి ముఖం ఎర్రగా కమిలిపోయింది.

***

ఏభై సంవత్సరాలుగా పాఠకులను అలరిస్తున్న ఒక తెలుగు వారపత్రిక దీపావళి సందర్భంగా కథలపోటీ ప్రకటించింది. బహుమతులు కూడా భారీ స్థాయిలో ఉన్నాయి. పది పేజీల కథకు మొదటి బహుమతి ఇరవై వేలు. రెండవ బహుమతి పది వేలు. మూడవ బహుమతి ఐదువేలు. ఐదు ప్రత్యేక బహుమతులు వెయ్యిరూపాయల చొప్పున. ఆ ప్రకటన చూడగానే నోట్లో నీళ్ళూరాయి రామారావుకు. బుర్రకు పదునుపెట్టాడు. పదిపాకెట్ల సిగరెట్లు తగలేశాడు. ఇరవై ఫ్లాస్కుల టీ జుర్రేశాడు. చివరకు ఓ కూర వండాడు. ఏ కోణం నుంచి చూసినా నలభీములను తలపించిందా కూర. వసుంధర కూడా వేలితో కొంచెం చప్పరించి ''ఆ ఇరవై వేలూ మనవే. ఇంత రుచిగా ప్రపంచంలోని ఏ కొమ్ములు తిరిగిన మగాడూ తయారు చెయ్యలేడు. ప్రైజ్‌మనీతో నాకు స్వాతిహారం చేయించాలి.'' అన్నది.

''ఓ ఐదువేలు నాకొదిలెయ్...మంచి స్టీరియో కొనుక్కుంటా.'' అన్నాడు రామారావు. ఓ గంటసేపు వాదులాడుకుని రాజీకొచ్చారు.

''ఆంజనేయులు గాడితో పొరపాటున కూడా ఈ కథ గురించి చర్చించొద్దు. కాపీ కొడతాడు. పోటీ ఫలితాలు ప్రకటించి పత్రిక నుంచి చెక్కు వచ్చిందాకా అసలు మళ్ళీ వీధి వైపు చూడొద్దు.'' సలహా యిచ్చింది.

''యూ ఆర్ రైట్.. ఏదైనా కథ పంపావా అని అడిగితే ఆలోచిస్తున్నా అని చెబుతా.. ఏమంటావ్?'' భార్య బుగ్గ గిల్లాడు రామారావు.

***

మూడు మాసాల తరువాత కథలపోటీ ఫలితాలు ప్రకటించారు. ఆంజనేయులు కథకు మొదటి బహుమతి లభించింది. రామారావు పంపిన కథ సాధారణ ప్రచురణకు స్వీకరించిన జాబితాలో కూడా లేదు. తనకు బాగా తెలిసిన ఆంజనేయులు కథకు మొదటి బహుమతి రావడంతో కుతకుతలాడిపోయాడు రామారావు. కథతోపాటు ఆంజనేయులు ఫోటో, పరిచయం వేశారు. ఆంజనేయులుకీ విషయం ముందే తెలిసుంటుంది. అయినా మాట మాత్రం తనతో చెప్పలేదు. 'బద్మాష్' అని పళ్ళు పటపట కొరుక్కున్నాడు.

పదిహేనురోజుల తరువాత వసుంధర ఆంజనేయులిగారింట్లో పేరంటానికి వెళ్ళొచ్చి చెప్పినవార్త మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లనిపించింది రామారావుకు. పత్రికవారు పంపిన ప్రైజ్ మనీతో ఆంజనేయులు భార్యస్వాతిహారం చేయించుకుందుట. ''దొంగముండ . నేను చేయించుకోవాల్సిన గొలుసు అది చేయించుకుంది. దాని నవ్వు చూస్తుంటే పళ్ళురాలగొట్టాలనిపించింది. ''చెడ తిట్టిపోసింది. అంతటితో ఆగితే బాగుణ్ణు. 'మంచి కథలు రాయడం చేతగాని దద్దమ్మవు' అని భర్తను అమ్మనా బూతులు తిట్టింది.

ఇంతలోనే ఓ అనూహ్య సంఘటన జరిగింది. బహుమతి పొందిన ఎనిమిది కథలు ప్రచురించిన తరువాత హఠాత్తుగా ఆ పత్రిక రావడం ఆగిపోయింది. రెండు మూడు వారాలు వరుసగా కనిపించకపోయే సరికి ఎంక్వైరీ చేశాడు రామారావు. పత్రిక దివాలా తీసి మూతపడ్డదని తెలిసింది. '' ఎంత అదృష్టవంతుడు ఆంజనేయులు! వాడికి ప్రైజు రాగానే పత్రిక ఆగిపోయింది. పది వారాలు ముందుగా మూతపడుంటే నాకీ మనోవేదన తప్పి ఉండేది కదా'' అని విపరీతంగా బాధపడ్డాడు రామారావు.

వారం రోజుల తరువాత ఒక సాయంత్రం పగలబడి నవ్వుతూ ఇంటికొచ్చాడు రామారావు. ఇంటికొచ్చి పగలబడి నవ్వాడు. పొట్ట చేత్తో పట్టుకుని పడీపడీ నవ్వాడు. వసుంధరకేమీ అర్థం కాలేదు.

కథకు తొలి బహుమతి వచ్చిందని, బయోడేటా పంపమని పత్రికవాళ్ళు టెలిగ్రాం ఇచ్చారట. ఎలాగూ ఇరవైవేలు వస్తున్నాయి కదాని రెండ్రూపాయల వడ్డీకి పాతిక వేలు తెచ్చి భార్యకు హారం చేయించాడట. ఆ డబ్బు రాలేదట. పత్రిక మూతబడిపోయింది. పత్రిక ఆఫీసుకు ఫోన్ చేస్తే వాళ్ళు ఆఫీసును సలంతో సహా అమ్మేసి ఎటో వెళ్ళిపోయారని, రికార్డు రూంలో పడున్న వేలాది కథలు, నవలలు, పాత పత్రికలు తూకానికి అమ్మేస్తున్నామని చెప్పార్ట. ఆ ఆంజనేయులు గాడి ముఖం చూడగానే నాకు చచ్చే నవ్వొచ్చింది. ఇంకా నయం. అదే పరిస్థితి నాకొచ్చినట్లయితే జీవితాంతం కుమిలి కుమిలి ఏడవడం నావంతయ్యేది. నేను ఎంతో అదృష్టవంతుడిని.'' మళ్ళీ నవ్వడం ఆరంభించాడు రామారావు.

★